# భగవంతం కోసం

**- త్రిపుర**

**నాలుగూ నలభయి ఆరు. ఇక్కడే ఉండమన్నాడు. నలభయి ఆరు నిమిషాలయిపోయింది నియమిత కాలం దాటి. భగవంతం ఇంకా రాలేదు. వస్తాడా ఈ రోజు? అసలు ఎప్పుడేనా వస్తాడా?**

సిగరెట్ వెలిగించేను. నల్లగా మాడుతూ మండుతూంది వర్జీనియా. ఏడో నంబర్ బస్ బాగా బలిసిన ఊరకుక్కలాగ దూరంనుంచి వస్తూంది. స్టాప్ దగ్గర ఆగి ఒక డజను మందిని పోసింది — సాధారణంగా చెట్టు కనిపిస్తే చేసేపని — మళ్ళీ ముందుకు పోయింది. భగవంతం లేడు ఆ గ్రూప్‌లో.

లెప్పర్ గేంగ్ ఒకటి పాటలు పాడుతూ అడ్డంగా పోతూంది. చేపలని పట్టే వలలాగ. కాని లాభంలేదు. "చిల్లర డబ్బుల్లేవు."

తరువాత బస్‌లో వస్తాడా? పదమూడో నెంబర్లో అట్నుంచి వస్తాడా?

ఎదురుగా, రూపం పొందిన న్యూమోనియా లాంటి ఇళ్లు, తడిగా ఊపిరి తిత్తుల్ని డెస్పరేట్‌గా సూర్యరశ్మిలోకి పైకి లాగి ఎండ వేద్దామన్న ఊహతో దగ్గుతున్నట్లు గోడల మీద స్ర్రియలిస్ట్ తడి మచ్చలు, చారలు, గోడ వెనక. గాలిలో నీళ్ళని దులుపుకుంటూ పచ్చగా ఆకాశ కిరణంలా అరిటి చెట్టు, ధైర్యంగా, అమాయకంగా, పిచ్చిది.

భగవంతం చెప్పకుండా వస్తాడు. ముందు చెప్పినా, ఎట్నుంచి వస్తాడో తెలీదు. ఎట్నుంచి వస్తాడో తెలిసినా, అనుకున్న టైమ్‌కి రాడు. ...వచ్చినా అతనితో ఏమిటి మాట్లాడ్డం?

రోడ్‌మీద పొట్టిగా, నల్లగా అంతర్ముఖాలతో పీత నడక ఆలోచనలతో ఖైదీల్లాగా. దూరంగా మూగ సముద్రం అర్థంలేని ఘోష పెట్తోంది. సగం కాల్చి పారేసిన పీకల మీద వర్షం పడి, మెత్తగా, ముద్దగా బైల్ రంగులో... ...

లేంప్ పోస్ట్‌కి ఆనుకొని కోట్ పాకెట్‌లోంచి పాత ఉత్తరం తీసేను. పదిహేనేళ్ళ క్రితం భగవంతం రాసిన ఉత్తరం, తుప్పరంగు. ... ..."నీ భయాలు, అనుమానాలు నాకు తెలుసు. భరించలేననుకుంటే ఇక లాభం లేదనుకుంటే, పరిగెత్తుకురా, వాళ్ళని వదిలేసి. నా యింటి ద్వారం ఎప్పుడూ తెరుచుకునే వుంటుంది......"

పాపం! లోకం మార్పులకి దూరంగా వుండి పాతబడిపోయాడు భగవంతం.

ఈ హోటల్లోకి వెళ్ళి కూర్చుని నిరీక్షిస్తాను. కిటికీలోంచి రోడ్ కనిపిస్తుంది. ఎట్నుంచి వస్తాడో?

హోటల్ చూడండి. దీన్ని చూస్తే నాకు రోత. దీని మేనేజర్‌ని చూస్తే అసహ్యం. దీనిలోని వెయిటర్స్‌ని చూస్తే భయం, అనుమానం. గాజు పెంకులు రుద్దినట్లుంటుంది మేనేజర్ ముఖం. దాన్ని చూస్తే అసహ్యం.

ఇందులోకి వచ్చి, పీడు చేయించి పెట్టే చెత్తని మెక్కి మెల్లగా కప్పల్ని తిన్న పాముల్లా పైకి పోయే జనాన్ని చూస్తే అసహ్యం.

ఈ పుట్టే అసహ్యం అంటే నాకు ఎంతో ఇష్టం, ప్రేమ. ఈ అసహ్యం తెరలుగా వస్తూంటే మూడో పెగ్ జిన్‌తో వచ్చే నెర్వస్ ఎనర్జీ దేహంలో వ్యాపిస్తున్నట్లుంటుంది. ఇక్కడ ఈ మూల టేబుల్ దగ్గర కూర్చుంటాను. కిటికీలోంచి రోడ్ మీద ట్రాఫిక్ కనిపిస్తుంది. లోపల ఈ పురుగులు మాట్లాడే మాటలు వినిపిస్తాయి.

భగవంతం పేరులోనే వుంది సనాతనత్వం. పాత ఫక్కీ, పిలకలు, కిర్రు చెప్పులు, చెవులకి కుండలాలూ ఆరవేసిన అంగవస్త్రాలు వినిపిస్తాయి, కనిపిస్తాయి ఈ పేర్లో. నేను అతని కోసం ఈ హోటల్లో కూర్చుని నిరీక్షించడం - ఒక పెద్ద పేరడాక్స్.

"మనికి ఇండిపెండెన్సేమిటి, మనం శుద్ధ వెధవలం. మనకి కేరక్టరొకటా. వుత్త ఫకీరు జాతి మనది......"

"మనిషి గుండులా గుంటాడు. ఆసనాలు వేస్తాడు. కాని బ్రహ్మ కాన్‌స్టిపేషన్... ..."

"నా డెసిప్లినీలైన్‌లో అన్నీ బ్రేక్స్... ..."

"నయాపైసా అప్పు పుట్టు... ... ..."

"పని చేస్తూ ఆవులింతలూ, ఏం ఉద్యోగమో..."

"మా బుజ్జిగాడికి గొంగళి పురుగులు కనిపిస్తే చాలు. చేత్తోనే అలా నలిపే... ..."

"మిడ్ ఫీల్డ్‌లో రిఫరీని పట్టుకు తన్నేరుట......"

"చూచుకోలేదుట. గన్ క్లీన్ చేస్తూంటే తూటా గుండెలోంచి......"

మా వాడి మొణుకు ఎందుకు విరిగిందో ధనాధిపతి దశ కూడామా......"

"పిచ్చెత్తిందట. కత్తి పీటతో పెళ్ళాన్ని, పిల్లల్ని నరికి... ..."

"నా ప్రమోషనెందుకు ఆగి పోయిందో శనిగాడు గాబోలు."

కాఫీ తెచ్చాడు వెయిటర్. కాఫీ! ఇది కాఫీ కాదు. వుత్త గోధుమ రంగు వేడి. • తిడదామనుకున్న తిట్లు తలచుట్టూ ఈగల్లాగ మూగేయి.

"నీ పేరేమిటి" అన్నాను తెగించి. ఏదో మహా రహస్యం తెలుసుకో బోతున్నట్లు ముఖం పెట్టి.

"ఉన్నిథన్".

ఉన్నిథన్, ఉన్నిథన్! కొబ్బరి తోటలు. మెల్లగా బ్రేక్ వాటర్స్‌లో బరువుగా పోయే పడవలు...... వెళ్ళిపోవడం... నల్లటి,వంకుల జుత్తల మెరుపులు, లవంగాలు, ఏలకులు, కొప్రా ... సుగంధం!...

"హో" అన్నాను.

" ఆ " అన్నాడు.

"ఇవాళ ఏదో తేలిపోవాలి. నేనో, అతనో, దీని కర్థం లేదు. లోపలికి పోయి ఆలోచించు, ఈ కాఫీకి ఎంత అర్థం లేదో ఉన్నిథన్ ఉనికికీ అంత అర్థం లేదు. జై ఫటాఫట్."

ఉన్నిథన్ మోకాళ్ళ దాకా మడిచిన లుంగీని మళ్ళీ సర్దుకుంటూ. భారతదేశంలోని వింతలూ విశేషాలు అన్నీ చూసేశాననుకున్న తన తెలివి తక్కువ తనాన్ని మలయాళంలో తిట్టుకుంటూ వెనక్కి తిరిగి పోయాడు.

... ... భగవంతం రాలేదు. బస్సులో రాలేదు. రిక్షామీద రాడు. నడవడు... ...

"ఫిట్సు కాబోలు, రెండు బాల్చీలు పొయ్యండి. నురగలు కక్కేస్తున్నాడు". రోడ్డుమీద మూగిన జనం. తమాషా. కానీ ఖర్చు లేకుండా చూడొచ్చు. ఏదో మజా. కాలక్షేపం. ఒళ్ళు జలదరిస్తుంది. దేవుడు మేలు చేశాడు. కాని, లేకపోతే మనమూ అలాగే. అమ్మో! అదో థ్రిల్.

ఉక్క, చమట, పురుగులు.

అప్పుడప్పుడు ఉప్పగా గాలి.

జిడ్డు.

వేడి.

పైని అలసిన సాయంకాలపు ఆకాశంలో ఎర్రగా కిర్లీ ఉమ్ముతూ సాగిపోతున్నాడు — సూర్యభగవాన్.

కాలు మడిచి గోడను ఆనుకుని గోళ్ళల్లోని కుళ్ళుని పైకి లాగుతున్నాడు. ఉన్నిథన్! ప్రేమగా పిలిచేను! ఉన్ని!

జడుస్తూ వచ్చాడు. ఇంకో కప్పు కాఫీ తెమ్మన్నాను. బ్రతిమాలుతున్న స్వరంలో, కలలో అసందర్భంగా కనిపించి, కరిగిపోయిన ఏదో తునకలాగ వెళ్ళిపోయాడు హోటల్ వెనుక శారవంలోకి.

భగవంతంకోసం ఎంత కాలం ఈ యాతన, ఈ నిరీక్షణ? ఎన్ని గంటలు? ఎన్నేళ్ళు?

"ఈ మనఃఫలకాన్ని, కాన్షస్‌నెస్‌ని పరిశుద్ధం చేసి......" అని అనుకుంటుంటే లోపలి లోపలి లోతుల్లోంచి నవ్వు ఉప్పెనగా వచ్చి. ఎడమచెయ్యి రిస్ట్ మీద గట్టిగా గిల్లుకున్నాను. సైన్ అది. 'డ్రామాలు మాని వేషాలు తీసేసి — ఆలోచించు' అని వార్నింగ్ సైన్.

శారవంలోంచి మెఫిస్టోఫిలిస్ లాగ వస్తున్నాడు. పొగలు కక్కుతున్న కాఫీ పట్టుకుని, దగ్గరగా వచ్చి, టేబుల్ మీద కాఫీ కప్పు పెట్టి, బెదురుతూ తిరిగి పోబోయే ఉన్నిథన్ కళ్ళల్లోకి చూస్తూ, కళ్ళతో బల వంతంగా ఆపి, "నువ్వులేవు, నువ్వు ఉత్తమాయ, నీకు ఉనికి లేదు. హ్యూమ్ చదివేవా! లాక్ ఏమన్నాడో తెలుసా? కాంట్! కర్క్‌గార్డ్? నువ్వు వున్నావని నే ననుకుంటూ! నీతో మాట్లాడుతున్నానని నువ్వు అనుకుంటుంటే, అలా అనుకుంటున్నావని నేననుకుం—"

ఉన్నిథన్ లుంగీ దక్షిణపు గాలిలో ఎగిరే తెరచాప లాగ... "అన్నా!"

కుడికన్ను ఓరగా పెట్టి ముక్కు అంచుమీంచి చూసే, న్యూమోనియా ఇంటి ఎడమ చివర కిటికీ మూడో ఊచనించి గీత మొదలు పెట్టి రోడ్ మీంచి కోసుకుంటూ వచ్చి మేనేజర్ బట్టతలని రాసుకుంటూ ఈ టేబుల్‌మీద ఉన్నిథన్ పెట్టి వెళ్ళిపోయిన కప్‌లో మెరిసే పొంగులో మిళితం అయిపోతుంది.



టేబుల్ మీద కాఫీ! కాఫీ! ఇది కాఫీ కాదు. ఉత్త వేడిగా వున్న గోధుమ రంగు.

పదమూడో నంబరు వచ్చి ఆగింది. ఆగి ఒక మార్క్ నిన్ ముఖాన్ని యూలిసెస్ లాగ వెడల్పుగా వున్న ముఖాన్నీ, ఒక టెరిలిన్ కవచాన్నీ, ఒక సైత స్కాప్‌నీ, ఒక అజ్ఞాతంలో వున్న అర్జుమన్ట్ దింపింది. భగవంతంలేదు. అట్నుంచి ఏదో నంబర్లో వస్తాడా?

ఉన్ని మేనేజర్ చెవిలో చెపుతున్నాడేదో మేనేజర్ వెనక్కి తిప్పేడు ముఖాన్ని — గాజు పెంకులు రుద్దిన ముఖం. బరువైన కళ్ళ రెప్పల క్రింద రెండు బలిసిన కుక్కలు — రోడ్ మీద అడ్డంగా, బద్ధకంగా, ఆవులిస్తూ పడుకొన్న రెండు పోతుల్లాటి కుక్కలు — మెల్లగా గుర్రు మంటున్నాయి. కళ్ళు మూస్తే పెద్ద గబ్బిలాల రెక్కలు, కుక్కల్ని నా వైపు ఉసిగొల్పేడు.

అదే క్షణం. ఇదే గొప్ప రిలేషన్. చుట్టూ మెరుపులు విద్యుకత్తుల్లా తళ తళమని ఎవరో దూస్తూ వుంటే, ఉరుములు రాక్షస రథాల్లా ఉరుకులు పెడ్తుంటే, దర్శనమిచ్చిన దయాళువు 'వరాలు కోరుకోమంటు ంటే.... ప్రపంచపు అరటిపండుని ఎవరో వొలిచి చేతుల్లో పెట్తూ వుంటే....

క్షణ మాత్రపు రివేలేషన్, కుక్కల్ని గబ్బిలాల రెక్కలతో మూసేశాడు మేనేజర్.

ఇంక జాగుచేస్తే లాభంలేదు, ముప్పు. లేచి వెళ్లేను కౌంటర్ దగ్గరికి.

ఇదిగో, ముందే యిచ్చేస్తున్నాను నాలుగు కప్పుల కాఫీకి డబ్బు.ఏం భయంలేదు. మెంటల్ హాస్పిటల్‌కి ఫోన్ చెయ్యండి కావలిస్తే. ఎవరూ అక్కణ్నుంచి తప్పిపోయి రాలేదు. అంతా భద్రంగా వుంది అక్కడ. ఉన్నిథన్ నా లాంగ్ లాస్ట్ ఫ్రెండ్. మీ కళ్ళల్లో పెంచుతున్నవి అల్పేషన్లా, డేల్మేషన్లా, డేక్షుండ్లా?''

తిరిగి వచ్చేశాను టేబుల్ దగ్గరికి. జవాబెందుకు నాకూ?

నిటారుగా, నీటుగా నిలబడ్డ కొబ్బరి చెట్ల బారులో తిక్కగా, సినికల్‌గా, పంక్చ్యుయేషన్ మార్కులన్నీ ఒకే చోట జలిమిలి అయిపోయినట్లు, ఎనిమిది వంకర్లతో పెరిగే యిన్ట్రోవర్డ్ కొబ్బరి చెట్టులా నిలబడున్నాడు ఉన్నిథన్ గోడవానుకుని.

''సెమికోలన్, ఎక్స్‌క్లమేషన్ మార్కులు విడదీసి, ఇక్కడకు వస్తావా ఉన్నీ?'' వచ్చాడు. ''మూడో కప్ తీసుకురా ప్లీజ్.''

ఒక్కొక్క మార్కు అలా వేల మీద జల్లుతూ వెళ్లేడు లోపలికి హెమింగ్‌వే వాక్యం లాగ. నీట్‌గా,

> 'త్రిపుర' కథలలో యాబ్‌స్ట్రాక్ట్ ధోరణి పరిపుష్టి నందింది.
>
> భౌతిక సంఘటనల నేపథ్యంలో మనిషి మనసు చేసే ఆలోచనలు, గీసుకొనే వ్యూహ చిత్రాల కల్పన ఈ కథ విశిష్టత. త్రిపుర శైలికి, కథన శిల్ప రీతికి ఇది ఒక ఉదాహరణ.
>
> — ఎడిటర్

బ్రిస్క్‌గా, ఓవర్ టోన్స్ ఏవీ లేకుండా.

భగవంతం వస్తుంటే ఏక్సిడెంటేదేనా అయి ఎముకలేవేనా విరిగి....

పసితనపు మానాగుకీ, పెద్దతనపు గడుసుతనం, చలాకీకి మధ్య తటపటాయిస్తున్న నలుగురి స్టూడెంట్ల గేంగ్ వచ్చింది లోపలికి తుళ్లుకుంటూ.

టేబుల్ చుట్టూ చదరంగా వుంచిన కుర్చీలన్నీ రకరకాల కోణాల్లోకి తిప్పి, జారబడుతూ కాళ్లు మెలికలుగా తిప్పుతూ, జాపుతూ కూర్చున్నారు.

ఉన్నిథన్ మూడో కాఫీ తెచ్చాడు. కాఫీ? అది కాఫీ కాదు. ఉత్త వేడిరంగు గోధుమ ఊహ.

.... బెంచి గాడేవిటి చెప్పేదురా ఇవాళ?

.... సరస్వతిలో టోనీ కర్టిస్. ఎలిజబెత్ టేలర్....

.... సుజాత అలాగ పతివ్రత లాగ క్లాసులో కూర్చుంటుంది గాని ఇద్దరు లవర్సురా బాబూ....

.... ఉత్త దుష్కీ మాటలాడకోయ్....

భగవంతంరాడు గాబోలు. పది లెక్కపెట్టి లేచాను. పైకి వెళ్తూ, యీ పై మాటల దగ్గర ఆగి అన్నాను విషాద స్వరంలో; అన్నీ కలిపేయండి. ఒకదానికొకటి గొలుసు లాగ కలిపి ఆలోచించండి. అర్థమయి పోతుంది. ఆ తరువాత అంతా సులభమే.

కౌంటర్ దగ్గర చేరి, ''మూడే తాగేను. నాలుక్కిచ్చేను. అదే లోకన్యాయం. మిగతాది పర్గటోరియోలో మనమిద్దరం కలుసుకున్నప్పుడు యిద్దురుగాని, టైం లేదు. ఉన్నిథన్‌కి కూడా చెప్పండి. బై. బై'' అని పైకి వచ్చేశాను.

ఆకాశంలో నక్షత్రపు జల్లు. భగవంతం రాడు. అట్నుంచి ఏడో నంబర్లోనూ రాదు, ఇట్నుంచి పదమూడో నంబర్లోనూ రాదు నా పిచ్చి గాని.

